




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 2వ భాగం

★ఇంత వరకూ రకరకాల తత్వవేత్తలు ప్రపంచం ఎలా వుందో చెప్పారు గానీ,దాన్ని ఎలా మార్చాలో చెప్పలేదు.

★యూరప్ ని వెంటాడుతున్నది ఒకే ఒక్కటి. అదే కమ్యూనిస్ట్ భూతం.

★చిట్టచివరి సారిగా, పెట్టుబడి దారుడ్ని వురితియ్యల్సిన తాడు కూడా, ఆ పెట్టుబడి దారుడు అమ్మినదే.

ఇవి మార్క్స్ కొన్ని మాటలు.

1838 మే లో తండ్రి చనిపోయిన దగ్గర నుండి 1841 వరకూ ఆ మూడు సంవత్సరములూ ఏం జరిగిందంటే? మార్క్స్ కి ఇంటి దగ్గర నుండి డబ్బులు రావడం తగ్గింది. తండ్రి బ్రతికి వుండగా ఆయన న్యాయవాది కాబట్టి, ఆదాయం బాగుండేది. అందుచేత, మార్క్స్ ఎంత అడిగితే అంత పంపిస్తుండేవాడు. ఇప్పుడు తండ్రి చనిపోయాక, ఇంట్లో ఆదాయం

లేదు. ఆయన బ్రతికి వుండగా రెండు ద్రాక్ష తోటలు కొన్నాడు. కానీ, దాని మీద వచ్చే ఆదాయం చాలా తక్కువ. అందుకని తల్లి చెప్పింది" ఒరే! అబ్బాయ్! ఆదాయం తగ్గిపోయింది. నేను ముగ్గురు పిల్లల్ని పోషించాలి. నాకు వీలయినంతలో నేను పంపించగలను. నీవు బాధ్యత గలవాడివిగా వుండు." అని కొడుక్కి ఉత్తరాలు రాస్తుండేది. మార్క్స తనని తానూ నియంత్రించు కోవడానికి ప్రయత్నిస్తూ, తప్పనిసరై అప్పులు చేయడం పరిపాటైంది. ఇలాంటి పరిస్థితిలో న్యాయవాద వృత్తిని వదిలేసి, అధ్యాపక వృత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్నాడు. దానికి సంబందించిన కోర్సులు తీసుకోవడం ప్రారంభించాడు.

అక్కడ సొంత వూర్లో జెన్నీ పరిస్థితి. నిశ్చితార్థం జరిగి 3,4 ఏళ్ళు అయింది. తండ్రి బ్రతికి వుండగా జెన్నీ సంగతులు కొడుక్కి రాస్తుండేవాడు. అతను చనిపోయాక ఎలాగో ధైర్యం చేసి, జెన్నీయే, మార్క్సకి ఉత్తరాలు ప్రారంభించింది. ఎందుకంటె, జెన్నీ అన్నకు ఈ పరిచయం ఇష్టం లేదు.  అందుకని అతనికి తెలియకుండా ఉత్తరాలు రాస్తుండేది. అయితే, ఆ వయసులో దూరంగా వుండే ప్రేయసీ ప్రియుల మధ్య వచ్చే చిన్న చిన్న అభిప్రాయ బేధాలే, వాళ్ళిద్దరి మధ్యా కూడా వచ్చాయి. "ట్రయర్ లో ఎవరితోనో మాట్లాడుతున్నావట" ఇలాంటి ఉత్తరాలు రాస్తుండేవాడు. అప్పుడు ఆమె రాసేది.

"అవును మాట్లాడిన మాట నిజమే. కానీ, నా మీద ఆ మాత్రం నమ్మకం లేదా? నీ గురించి కూడా ఎవరెవరో, ఏదేదో చెబుతున్నారు. తీవ్రవాదులతో తిరుగుతున్నావనీ, నాస్తిక భావాల వైపు వెళుతున్నావనీ' అంటున్నారు. కానీ, నాకైతే నువ్వు చేసేది ఏదైనా సమ్మతమే. నువ్వు ఎప్పటికైనా ప్రపంచాన్ని జయిస్తావన్న నమ్మకం నాకుంది. తొందరగా చదువు ముగించుకొని, ఏదో ఒక వుద్యోగం తెచ్చుకొని, నన్ను పెళ్లి చేసుకో"అని జెన్నీ రాస్తుండేది.

1841లో డిగ్రీ చిట్ట చివరి సంవత్సరం లోకి వచ్చాడు. థీసిస్ రాయాల్సిన సమయం వచ్చింది. అప్పటికే ప్రభుత్వ వ్యతిరేకులతో సంబంధాలు పెట్టుకున్న మార్క్సకి తను చదువుతున్న బెర్లిన్ యునివర్సిటీ నుండి డిగ్రీ వచ్చే అవకాశం కనిపించలేదు. "PHD కోసం తను రాసిన సిద్దాంత వ్యాసం గ్రీకు తత్వవేత్త " ఎపిక్యురస్" తత్వాన్నీ, "డెమొక్రటిస్" తత్వాన్ని పోలుస్తూ చేసిన విశ్లేషణ! ఇంకా, మార్క్స కమ్యునిజం వైపు మళ్ళని రోజుల్లోనే, తను ఎలాంటి భావ జాలం వైపు అడుగులు వెయ్యబోతున్నడో, ఆ సిద్దాంత వ్యాసంలో రాశాడని విశ్లేషకులు చెబుతారు. అందులో ఆయన వెలిబుచ్చిన భావాలు చాలా తీవ్రంగా వున్నాయి. బెర్లిన్ యునివర్సిటీ డిగ్రీ ఇవ్వక పోవడానికి అది కూడా ఒక కారణం.

అప్పుడు మార్క్స ఏం చేసేడంటే, "జన" అనే చిన్న పట్టణం లో ఒక చిన్న యునివర్సిటీ వుంది. దాన్ని డిగ్రీల ఫ్యాక్టరీ అనే వాళ్ళు ఆ రోజుల్లో. అది ఇప్పటికీ వుంది. తరువాత రోజుల్లో అక్కడ చదివిన అనేక మందికి నోబెల్ బహుమతులు కూడా వచ్చాయి. ఆరోజుల్లో అంటే 170 ఏళ్ళ క్రితం సంగతులు. మార్క్స ఆ యునివర్సిటీ కి తను రాసిన

పరిశోధనా గ్రంధాన్ని పంపించాడు PHD కోసమని. మరి ఆ రోజుల్లో డిగ్రీ అయిన తరువాత వచ్చినదాన్ని, PHD అంటారనుకుంటాను (1841తరువాత వచ్చిన దాన్ని PHD అని రాసి వుంది.)

అయితే, తను రాసిన సిద్ధాంత గ్రంధాన్ని 1841 ఏప్రెల్ 6న పంపిస్తే, 1841 ఏప్రెల్ 15 న అంటే వారం రోజుల్లో ఆ యునివర్సిటీ వాళ్ళు PHD ని పంపించారు. మార్క్స్ రాసిన ఆ సిద్ధాంత గ్రంధానికి రెండు ప్రత్యేకతలు వున్నాయి.

1. దానిని తనకు కాబోయే మామ గారికి అంకితం చేసాడు. "చిన్నప్పటినుండి నాలో విజ్ఞాన బీజాలు నాటిన వాడూ, నన్ను జ్ఞ్యాన తృష్ణ వైపు నడిపిన వాడూ అయినటువంటి" లూడ్విగ్" కి దీనిని అంకితం చేస్తున్నాను." అని రాసాడు.

2. అలాగే ఆ సిద్ధాంత గ్రంధం రాయడం లో తనకు సహాయం చేసిన "బ్రూనో బ్రోయర్"కి.

ఈ బ్రూనో బ్రోయర్ మార్క్స్ కి మంచి మిత్రుడు. ఇతనికి మార్క్స్ గతంలో చదివిన 'బాన్' యునివర్సిటీలో టీచర్ వుద్యోగం వచ్చింది. అతను వెళ్ళిపోతూ "నేను బాన్ కి వెళ్ళిపోతున్నాను. నీకు కూడా అక్కడ ఏదైనా వుద్యోగం చూస్తాను వచ్చేసేయ్" అన్నాడు. మార్క్స్ కూడా అదే చూస్తున్నాడు. తను ఎలాగూ టీచర్ గా చేయాలనీ, న్యాయవాద వృత్తి వైపు వెళ్ళలేదు. అందుకని బాన్ యునివర్సిటీ కి వెళ్ళాడు. అయితే వెళ్లేసరికి అక్కడ పరిస్థితులు వేరుగా వున్నాయి. ఈ బ్రూనో ఉద్యోగ పరిస్థితే అనుమానంగా వుంది. ఎందుకంటే, బ్రూనో ప్రభుత్వ వ్యతిరేక కార్యకపాల్లో, తీవ్రవాద ఉద్యమాల్లో తిరుగుతున్నాడని తెలిసి, అతని వుద్యోగం తీసేశారు. అంతేకాదు, అతనితో కూడా ఎవరెవరు తిరుగుతున్నారోనని రహస్య ఆదేశాలు కూడా వచ్చాయి. దాంతోటి, మార్క్స్ కి ప్రష్యా లో అంటే, (ప్రష్యా జర్మనీ లో ఒకభాగం అనుకున్నాం కదా!) ఎక్కడా కూడా టీచర్ వుద్యోగం వచ్చే ఛాయలు కనిపించడం లేదు.

ఆ రోజుల్లో, 1841లో, అలా చదువుకున్న యువకులు తేలిగ్గా వెళ్ళగలిగే మార్గం ఒక్కటే, అదే 'జర్నలిజం'. అప్పటికి మార్క్స్ వయస్సు 23 సంవత్సరాలు. జెన్నీ వయస్సు 27 సంవత్సరాలు. నిశ్చితార్ధం జరిగి 5 ఏళ్ళు అయింది. ఏదో ఒక స్థిరమైన వుద్యోగం వుంటే తప్ప వివాహం చేసుకోలేని పరిస్థితి. అలాంటప్పుడు మరో మార్గాంతరం లేక తన ఊర్లోనే వున్నాడు మార్క్స్. పత్రికలకు వ్యాసాలు రాయడం ప్రారంభించాడు. అలా జరుగుతుండగా 1841లో కాబోయే మామగారికి తీవ్రమైన అస్వస్థత చేసింది. అప్పటికి జెన్నీకీ, మార్క్స్‌కీ నిశ్చితార్ధం అయిపోయిందని వూర్లోనీ, జెన్నీ ఇంట్లో కూడా తెలిసిపోయింది. ఎలాగూ అందరికీ తెలిసిపోయింది కదాని, కాబోయే మామగారికి సహాయం చేయడం కోసం జెన్నీ ఇంట్లోనే వున్నాడు రెండు, మూడు నెలల పాటు.

ఈ విషయం జెన్నీ మారుటి అన్నకు తెలిసింది. కానీ, అప్పటికి వున్న పరిస్థితి, తండ్రికి వున్న అనారోగ్యం దృష్ట్యా మార్క్స్‌ని ఏమీ అనలేకపోయాడు. ఆ తరువాత అతను మరో మూడు నెలలకి 1842 మార్చి 3న చనిపోయాడు. అతను చనిపోవడం తో కుటుంబం జెన్నీ కుటుంబమంతా మారుటి అన్న ఆధ్వర్యం లోకి వచ్చింది. ఇక్కడ వుంటే, మార్క్స్,

జెన్నీల వివాహానికి అతను ఒప్పుకోదని, జెన్నీ, వాళ్ళ అమ్మా, ఇద్దరూ అక్కడకు 50 మైళ్ళ దూరం లో వున్న జెన్నీ మేనమామ దగ్గరకు వెళ్ళిపోయారు.

ఇదంతా జరిగేసరికి 1842 సంవత్సరం మధ్యలోకి వచ్చారు. మార్క్స్ పేపర్లకి వ్యాసాలు రాసి, జర్నలిష్టు అవ్వాలని చూస్తున్నాడు. 1842 మే 25 న ప్రభుత్వం పత్రికమీద విధించిన ఆక్షలకు వ్యతిరేకంగా మార్క్స్ రాసిన వ్యాసం ఒక పత్రికలో వచ్చింది. అది జర్నలిస్ట్ గా మార్క్స్ వేసిన మొట్టమొదటి అడుగు. ఆ తీవ్రమైన వ్యాసం పెద్ద సంచలనం కలిగించింది. ఎందుకంటే, మార్క్స్ అందులో వెలిబుచ్చిన భావాలు ఎలా వున్నాయంటే" క్రైస్తవమతం అందరికీ కావాలంటున్నారు. అసలు క్రైస్తవ మతం అంటే ఏమిటి? ప్రొటెష్ టెంట్, కేథలిక్కులున్నారు. మరి ఏది క్రైస్తవ మతం? క్రైస్తవమతం తీసుకొని వాళ్ళందరినీ దుర్మార్గులు అంటున్నారు. అది ఎంత వరకు సమంజసం. " ఇలాంటి భావాలతో తన మొట్ట మొదటి వ్యాసంలో రాసాడు.

ఇక జెన్నీ తన అమ్మమ్మ గారి ఇంటి వద్ద వుంది కదా! ఆమె పెళ్లిని గురించి ఒత్తిడి తేవడం ప్రారంభించింది. అప్పటికే నిశ్చితార్థం అయి, 5 సంవత్సరాలు అయింది. "నువ్వు ఏం చేసినా పర్వాలేదు. ఎన్ని కష్టాలు పడుతున్నా పర్వాలేదు. నీతోనే వుంటాను. నువ్వు నడిచేది పూల బాటే కానక్కరలేదు. రాళ్ళ బాటైనా, పూల బాటైనా నీ వెనకాలే వస్తాను. పెళ్లి చేసుకో" అని అనడం ప్రారంభించింది. మార్క్స్‌కి ధైర్యం చాలడం లేదు. 'వుద్యోగం లేకుండా ఆమెను ఎలా పోషిస్తాను' అనుకున్నాడు. ఆ సమయంలో, చేతిలో ఆదాయంలేని పరిస్థితి లో తల్లిని అడిగాడు – నువ్వు ఎలాగైనా డబ్బులు ఇవ్వాలని.

దానికి తల్లి అంది " చూడూ! నాకు కుటుంబం పోషించడానికే కష్టంగా వుంది. ఒక్కర్తినే సంసారాన్ని ఈదుకొస్తున్నాను. నీకు కాబోయే అత్తవారు కూడా పెద్దగా పట్టించు కోవడం లేదు. ఇలాంటి పరిస్థితిలో నన్ను ఇంకా డబ్బులు ఇవ్వమంటే నేనేమీ చెయ్యలేను."అని. దాంతో ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. ఇంట్లో ఉండకుండా బయటకు వెళ్ళిపోయాడు. ఊర్లోనే ఒక గెస్ట్ హౌస్ వుంటే అక్కడ వున్నాడు. మార్క్స్ అక్కయ్య "సోఫీ"కి వివాహం జరగవలసి వుంది. ఆమె వివాహం అయ్యాక తన ఊరునుండి "కొలోన్"అనే ఊరు వెళ్ళిపోయాడు మార్క్స్.

అక్కడ నుండి పత్రికలకు వ్యాసాలు రాయడం ప్రారంభించాడు. "రైలీ సే సైటుంగ్" అనే పత్రికల వాళ్ళు కొద్దిగా పారితోషకం కూడా ఇస్తుండేవారు. అయితే, మార్క్స్ వ్యాసాలకు మంచి ప్రజాదరణ వచ్చేది. ఒక రెండు, మూడు నెలలు అయ్యాక అదే పత్రిక వాళ్ళు సంపాదకుడిగా ఉండమన్నారు. 1842 అక్టోబర్ 14న సంపాదకుడిగా నియమించారు. మార్క్స్‌కి అది ఒక గొప్ప అవకాశంగా వచ్చింది తన 24 ఏళ్ళ వయసులో. కాకపోతే, తను ఏ రోజైతే సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించాడో, అదే రోజున తన ఇంటివద్ద 23 ఏళ్ళ వయసు వున్న తన తమ్ముడు "హెర్మన్" చనిపోయాడు.

ఈ పత్రికకు సంపాదకుడిగా కొనసాగుతున్న రోజుల్లో "'హెగెల్ సిద్ధాంతం అనేది నేలవిడిచిసాము చేస్తున్నది. వాస్తవికత లోపించింది." అని రాస్తూ, హెగెల్ యొక్క అతి వాదుల్ని విమర్శించడం ప్రారంభించాడు. నిజానికి ఒకప్పుడు మార్క్స్ హెగెల్ అతివాదులతో కలసి తిరిగినవాడే. కానీ, పత్రికలో పనిచేయడం ప్రారంభించాక, మరింత విస్తృత అధ్యాయనం వలన, వాళ్ళ నుండి విడిపోయి, వాళ్లకు వ్యతిరేకమైన వ్యాసాలు రాసాడు. అలాంటివే కాకుండా ప్రభుత్వ అధికారుల అవినీతినీ, అడవిలో కట్టెల దొంగతనాలూ, ద్రాక్ష తోటలలోని కార్మికుల కష్టాలూ ఇలాంటివి కూడా రాసేవాడు. పూర్తి స్వేచ్ఛ వచ్చేసరికి పత్రికకు విపరీతమైన ప్రజాదరణ వచ్చేలా చూసాడు. మార్క్స్‌కి పేరొచ్చింది. అలాగే పత్రిక అమ్మకాలు కూడా పెరిగాయి. కానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తుంటే, ఊరుకోదు కదా! పత్రికమీద నిఘా ఎక్కువయ్యింది. దాంతో, మార్క్స్ సంపాదకత్వం వహిస్తున్న "రైలీ సే సైటుంగ్" పత్రిక 1843 మర్చి 17 న నిషేధించారు. 1843 లో మార్చి చివరలో వచ్చిన సంచికే చివరి సంచిక అయింది. ఆ విధంగా మార్క్స్ సంపాదకుడిగా ఆరు నెలలు మాత్రమే పనిచేసాడు. మళ్ళీ మార్క్స్ జీవితం తెగిన గాలిపటం అయింది. రెండో వైపున జెన్నీ ఆరోగ్యం దెబ్బతింటోంది. తండ్రి చనిపోవడం తో తరచూ డిప్రెషన్ కు లోనయ్యేది. ఇటు మార్క్సును పెళ్ళిచేసుకోమంటున్నది. పెళ్లి జరిగితే ఎలా బ్రతకాలి? మార్క్స్ కూడా అదే గందరగోళంలో వున్నాడు.

ఆ సమయంలో వాళ్ళ పిన్ని గారి దేశం అయిన "హాలెండ్" వెళ్ళాడు. అతని బాబాయ్ పేరు" లయన్ ఫిలిప్స్" (ఈ లయన్ ఫిలిప్స్ వాళ్ళ అబ్బాయే ఎప్పుడు మనం వాడుతున్న ఫిలిప్స్ ఎలక్ట్రనిక్స్ కంపెనీ ని స్థాపించింది) వాళ్ళ ఇంటికి వెళ్లి అడిగాడు"మా అమ్మకు రావలిసిన వారసత్వపు డబ్బులు వున్నాయి కదా! మా అమ్మని అడిగితే ఏమీ చెప్పడం లేదు. మీరైనా చెప్పండి. అవి ఎలా వస్తాయో?" అన్నాడు మార్క్స్.

"అబ్బాయ్! అవి ట్రస్ట్ డబ్బులు. మీ అమ్మ చనిపోయిన తర్వాతే, నీకు వారసత్వంగా వస్తాయి. కాకపోతే, నువ్వు ఇబ్బందులు పడుతున్నానని అంటున్నావు కాబట్టి, మేమే ఏదో కొంత ఇస్తాము. అది కూడా ఉదారంగా ఏమీ కాదు. అప్పుగానే. ఆ తరువాత నీకు డబ్బులు వచ్చిన తర్వాత ఇచ్చేద్దువు గానీ" అని వాళ్ళు కొంత డబ్బు ఇచ్చారు.

ఆ డబ్బులు తీసుకొని తన ఊరు వచ్చేసాడు. ఇంటికి వచ్చిన తర్వాత అతనికి తెలిసిన శుభవార్త ఏమిటంటే, అంతకు ముందు తనతో కలసి పనిచేసిన మిత్రులు కొందరు "పారిస్ వెళదాం. అక్కడ ఒక పత్రిక పెడదాం." అన్నారు. అక్కడకు వెళ్లి పత్రిక పెట్టడానికి కారణం ఏమిటంటే, ఫ్రాన్సు దేశంలో ఆంక్షలు తక్కువగా ఉండేవి. స్వేచ్ఛ ఎక్కువగా వుండేది. ఆ యూరప్ దేశాల్లో ఆంక్షలపాలై పారిపోయిన చాలా మంది ఫ్రాన్సులో ముఖ్యంగా పారిస్ లో తలదాచుకునేవారు. "అందుచేత అక్కడకు వెళ్లి మన వాణి ని వినిపించుదాం" అని మిత్రులు కొందరు చెప్పారు. ఆ చెప్పినటువంటి మిత్రులు ధనవంతులే. "మేం డబ్బులు పెడతాం. నువ్వు సంపాదకత్వ బాధ్యత తీసుకో. నీకు స్థిరంగా సంవత్సరానికి ఇంత అని ఇస్తాం" అన్నారు.

స్థిరమైన ఆదాయం వస్తుంది. పైగా పారిస్ లో పెద్దగా ఇబ్బందులు ఏమీ వుండవు– అనుకుని ఒప్పుకున్నాడు. ఇక పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఆ విషయాన్నీ జెన్నీకి చెప్పాడు. అయితే, మార్క్స్ వెళ్ళిపోబోతున్నాడని అందరికీ తెలిసిపోయింది. అంతకు ముందు పత్రికల్లో వచ్చిన వ్యాసాలూ అవి గమనించి, ప్రష్యా ప్రభుత్వం ఏమనుకున్నదంటే... 'ఈ కుర్రవాడిని ఇలా వదిలేస్తే, కష్టం. ఇక్కడ కుదరకపోతే మరో దగ్గరైనా ఉద్యమాలు లేవదీస్తాడు. ఇతన్ని లొంగదీసుకోవాలంటే, ఒకటే మార్గం. అనుకొని. "ప్రభుత్వంలో ఒక చక్కటి వుద్యోగం ఇస్తాము. వచ్చి చేరు." అని, మార్క్స్ నాన్నగారి మిత్రుడి ద్వారా మార్క్స్ కి ఒక సందేశం పంపించారు. మార్క్స్ ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదు.

ఈలోగా మర్క్సుకి కాబోయే బావమరిది (అంటే, జెన్నీ మారుటి అన్న) అతను మార్క్స్ కూ, జెన్నీ కి చెడగొట్టాలని చాలా ప్రయత్నించాడు గానీ, కుదరలేదు. పైగా ఇద్దరూ పెళ్లి ప్రయత్నాలు కూడా చేస్తున్నారని తెలుసుకుని, "సరే! ఎలాగూ వీళ్ళను విడదీయడం సాధ్యం కాలేదు కనీసం ఇక్కడే వుంటే, కళ్ళముందు వుంటారు. చెల్లెల్ని జాగ్రత్తగా చూసుకోవచ్చు. మార్క్స్ ఎక్కువగా తీవ్రవాదులతో తిరుగుతున్నాడు. అలా వెళ్ళిపోతే చెల్లిలి జీవితం ఏమవుతుందో?' అనుకుని ఎప్పుడూ ద్వేషంగా వుండే అతను మార్క్సుతో చెప్పాడు " నువ్వు ఇక్కడే వుండు. ప్రభుత్వం లో వుద్యోగం ఇప్పిస్తాను." అని. అతను అప్పటికే ప్రభుత్వంలో వుద్యోగం చేస్తున్నాడు. ఆ ప్రతిపాదనను కూడా తిరస్కరించాడు. మార్క్స్ కి ఈ రాజీ పడనీ తత్వమే అతనికి బలం అయింది. ఆ పట్టుదలే అతని చేత "కేపిటల్" రాయించింది

సరే! ఉద్యోగ వద్దనుకున్నాడు. పారిస్ లో పత్రిక కోసం ప్రయత్నాలు చేస్తున్నారు మిత్రులు. పరిస్థితులు అన్ని తనకు స్థిరత్వం కలిగించేటట్లే వున్నాయి. కాబట్టి ఇక వివాహానికి సిద్దమయ్యాడు. మార్క్స్. జెన్నీల ఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ ఫలించ బోతున్న సమయం. ఆ తరువాత మార్క్స్ జీవితాంతం తోడూ నీడగా నిలిచి, తన జీవితం కూడా అతని ఆశయసాధనకే అర్పించిన జెన్నీ, మార్క్స్ జీవితం లోనికి అధికారికంగా 1843 జూన్ 19 అడుగుపెట్టింది. పెళ్లి అంత అంగరంగ వైభవంగా ఏమీ జరగలేదు. చాలా సాధారణంగా జెన్నీ వాళ్ళ అమ్మమ్మ గారి "క్రాజ్ నాక్" అనే వూరిలో, ప్రొటెస్టెంట్ చర్చ్ లో జరిగింది. మార్క్స్ తాలుకా వాళ్ళు ఎవరూ రాలేదు. ఎందుకంటె, తల్లితో తగాదా పెట్టుకున్నాడు. జెన్నీ వాళ్ళ అమ్మా, జెన్నీ తమ్ముడు ఎడ్గర్(ఇతను మార్క్సుకి క్లాస్ మేట్) మరి కొంతమంది మిత్రులు, చాలా సమీప బంధువులు. మాత్రమే వచ్చారు. విచిత్రం ఏమిటంటే, పెళ్లి జరగానికి ఏడు సంవత్సరాల ముందు నిశ్చితార్థం జరిగినపుడు, మార్క్స్ తరుపు వాళ్ళు మాత్రమే వున్నారు. జెన్నీ తరుపు వాళ్ళు ఎవరూ లేరు. ఇప్పుడు వివాహానికి ఆ సమీకరణం అటు నుండి ఇటయ్యింది. వివాహం జరిగేసరికి మార్క్స్ వయసు 25. జెన్ని వయసు 29. ఆ సందర్భంలో జెన్నీ అమ్మగారు వంశపారంపర్యంగా వస్తున్న వెండి వస్తువులు కూతురుకి బహుమతిగా ఇచ్చింది. అంతేకాదు, కూతుర్నీ, అల్లుడ్నీ హనీమూన్ కి వెళ్ళిరమ్మని డబ్బులు కూడా ఇచ్చింది.

కొత్త దంపతులు "స్విజ్జర్లాండ్" వెళ్లారు. వెళ్ళేటప్పుడు మార్క్స్ పెట్టెనిండా పుస్తకాలు తీసుకెళ్ళాడట హనీమూన్ వెళ్ళినపుడు కూడా. ఎందుకంటే, సమయం దొరికితే ఆ పుస్తకాలు చదవాలి. రాయబోయే సిద్ధాంత గ్రంధానికి సమాచారం క్రోడీకరించుకోవాలి. అప్పటి వరకూ మార్క్స్ ఒక్కడే డబ్బులు ఎక్కువగా ఖర్చు చేసేవాడు. జెన్నీ కి పెద్దగా డబ్బులు ఖర్చు పెట్టడం తెలీదు. కారణం, ఆమె అంత వరకూ తల్లి దగ్గరే వుంది. కాకపోతే, మార్క్స్‌తో కలసి వెళ్ళింది కాబట్టి, డబ్బు ధారాళంగా ఖర్చు పెట్టేశారు. దాంతో తీసుకువెళ్ళిన డబ్బులన్నీ అయిపోయాయి. తిరుగు ప్రయాణంలో అక్కడక్కడ ఆగుతూ, తెలిసిన మిత్రుల సహాయం తీసుకొని, మొత్తానికి ఇంటికి చేరుకున్నారు.

అయితే, హనీమూన్ కి వెళ్ళినపుడు పుస్తకాలు కూడా తీసుకువెళ్ళాడు కదా! హనీమూన్ లో ఉండగానే ఆ పుస్తకాలన్నీ చదివేశాడు. అప్పుడు రాసుకున్న నోట్సులే "కార్ల్ మార్క్స్ సంతకాలు" గా ప్రచారం లో వున్న మాటలు.

★మతం మనిషి పాలిట మత్తు మందు.

★ మానవ జాతికి స్వేచ్ఛ అంటే, అది శ్రామిక జనవిముక్తే.

ఇలాంటి వాక్యాలన్నీ, ఆయన ఆ హనీమూన్లో రాసుకున్న నోట్సు నుండి కొన్ని మాటలు మాత్రమే. అయితే, ఇంటికి వచ్చిన రెండు నెలలకి వాళ్లకు తెలిసిన సంతోషమైన వార్త ఏమిటంటే, జెన్నీ గర్భవతి. 1843 అక్టోబర్ లో మా జెన్నీ, మార్క్స్ ల పారిస్ ప్రయాణానికి రంగం సిద్ధమయింది. ఏడేళ్ళ నిరీక్షణ ఫలించింది. భర్తకు స్థిరమైన ఆదాయం లభించబోతోంది. మరో ఏడు నెలల్లో పాపో, బాబో పుట్టబోతున్నాడు. భవిష్యత్తు ఎంతో అందంగా కనబడుతోంది. ఆ క్షణం లో అంత అందంగా ఊహించుకొన్న జీవితం, ఎంత ముళ్ళ బాట కాబోతోందో, తరువాత, తరువాత గానీ అనుభవం లోనికి రాలేదు. అది చేదు వాస్తవం. ఆనాడు తన సొంత ఊరునీ, తన సొంత దేశాన్ని వదిలి పెట్టిన జెన్నీ, మార్క్స్ లు యేవో కొద్ది నెలలు తప్ప, మళ్ళీ స్వదేశంలో జీవించలేదు. ఏదో ఉద్యోగానికి పారిస్ వెళుతున్నాం. వెనక్కి వచ్చేస్తాం. అనుకున్నారు గానీ, 'మళ్ళీ ఎప్పుడూ స్వదేశం లో జీవించము.' అని ఆ సమయంలో కనీసం ఊహించలేదు.

అక్కడ నుండి మార్క్స్ జెన్నీల జీవితం పరుగు....పరుగు...దేశం నుండి, దేశానికి పరుగు. 1843 అక్టోబర్ లో పారిస్ లో అడుగు పెట్టారు. న్యూస్ పేపర్ పెట్టలనుకున్న మిత్రుల పేర్లు బ్రూగే, హర్వే. (చాలా సందర్భాలలో కావాలనే వ్యక్తుల పేర్లూ, ప్రదేశాల పేర్లూ చిన్నవిగా ఉంచుతున్నాను స్పష్టత, సరళత కోసం. అత్యవసరమైన పేర్లు మాత్రమే పూర్తిగా ఇస్తున్నాను.) ఈ బ్రూగే, హర్వే బాగా డబ్బున్న వాళ్ళు. పత్రిక పెట్టుబడిలో ఎక్కువగా భాగం వాళ్ళదే. ఇక్కడ మార్క్స్ పెట్టుబడి ఏమిటంటే, కేవలం ఆయన మేధస్సూ, ఆలోచనలూ, అనుభవం మాత్రమే. కొత్త దేశం, కొత్త భాష, కొత్త

సమాజం, కొత్త ప్రజలు. మర్క్సుకూ, జేన్నీలకు కొత్త జీవితం. అయినా గానీ, పెద్దగా ఇబ్బందులేవీ లేకుండానే అలవాటు పడ్డారు పారిస్ జీవితానికి.

మార్క్స్, అతని సహచరులూ, ఈ న్యూస్ పేపర్ భాగస్వాములూ ఏమనుకున్నారంటే, “అసలే కొత్త ప్రదేశం, ఇంకా మనం పత్రిక కూడా ప్రారంభించలేదు. ఖర్చుల్ని అదుపులో పెట్టుకుంటే బాగుంటుంది. అందుకని, మనం అందరమూ కలసి ఒకే ఇంట్లో వుందాం.” అని అభిప్రాయపడి, ఒక రెండు అంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఎవరి గదుల్లో వాళ్ళే వుంటారు. వంట మాత్రం అందరూ ఒక దగ్గరే వండుకోవడం, తినడం. అదంతా ఆడవాళ్ళ పని. అందరూ వంతులు వారిగా చేస్తారు. మగవాళ్ళు పత్రిక పనులు చేస్తారు. పత్రిక ఆఫీసుని వీళ్ళు నివాసం ఉంటున్న వీధికి పక్కవీధిలో వుంది. ఒక రకంగా మినీ సోషలిస్ట్ సమాజంలాగ జీవిద్దాం అనుకున్నారు. కాకపోతే ఆ ప్రయోగం నెల రోజులు మించి కొనసాగలేదు. మార్క్స్, జెన్నీలు అక్కడకు దగ్గరలోనే వేరే ఇంటికి వెళ్ళిపోయారు.

తరువాత రోజుల్లో ఆయన భాగస్వామ్యం వహించిన కొన్ని పోరాటాలు గానీ, కొన్ని సంస్థలు గానీ వాటిల్లోకి ఎలా వెళ్ళాడో తెలుసుకోవాలంటే ‘పారిస్’ పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవాలి. జర్మనీ నుండి లక్షలాది మంది ప్రజలు అక్కడకు అంటే ఫ్రాన్సు కు ముఖ్యం గా పారిస్ కు వచ్చేవారు. కొంతమంది పారిపోయి వచ్చిన వాళ్ళు. కొంత మంది బ్రతుకు తెరువు కోసం వచ్చిన వాళ్ళు. కొంత మంది వృత్తి నైపుణ్యం కోసం పై చదువులకోసం వచ్చిన వాళ్ళు – ఇలాంటి వారు అక్కడ లక్షలాది మంది వున్నారు. వాళ్ళ ఆశయాలను బట్టి, వాళ్ళ యొక్క కార్యకలాపాల్ని బట్టి, సంఘాలూ, రహస్య సంఘాలూ ఉండేవి. ఇక్కడ నుండి కూడా కొంత మంది జర్మనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించడం లాంటివి చేస్తూ వుండేవాళ్ళు. తరువాత రోజుల్లో మార్క్స కూడా అలాంటి సంఘాల్లో చురుకైన పాత్ర పోషించాడు. అదంతా తరువాత కథ.

పారిస్ వచ్చిన వెంటనే పత్రిక ప్రారంభిద్దామని అనుకున్నారు గానీ, మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా 1844 ఫిబ్రవరిలో మొదట సంచిక విడుదల అయ్యింది. మార్క్స సంపాదకత్వం లో వచ్చిన ఆ మొట్టమొదట సంచికలో రాజకీయ విశ్లేషణలూ, వ్యాసాలూ, కవితలూ వున్నాయి. అవి వెయ్యి కాపీలు అచ్చు వేశారు. కానీ, వాళ్ళు అనుకున్నంత స్పందన రాలేదు. ఫ్రాన్సులో ఆ పత్రిక కొనేవాళ్ళే లేకపోయారు. జర్మనీని వ్యతిరేకిస్తూ రాసిన వ్యాసాలు వున్నాయి కాబట్టి, జర్మనీ కి పంపిద్దామని అనుకున్నారు. కానీ, జర్మనీ, తన దేశపు సరిహద్దుల్లోనే ఆపేసింది. ప్రష్యా ప్రభుత్వం “ఈ పేపరు నడిపేది ఎవరు? ఎక్కడ నుండి వస్తోంది? అని ఆరా తీసింది. “ఈ పత్రికని నడిపే వాళ్ళు ప్రష్యా లో అడుగుపెడితే, వెంటనే అరెస్ట్ చెయ్యండి.” అని ఉత్తర్వులు జారీ చేసింది. మార్క్స గానీ, జెన్నీ గానీ తమ దేశానికి వెళ్ళే మార్గాలన్నీ మూసుకు పోయాయి పత్రిక మొట్ట మొదటి సంచికతోనే.

అది అలా వుండగా పత్రికలో వున్న భాగస్వాముల మధ్య ఏవేవో తగాదాలు మొదలయ్యాయి. “నువ్వు ఎక్కువ ఖర్చు పెడుతున్నావు అంటే, నువ్వు ఎక్కువ ఖర్చు పెడుతున్నావు” అనుకున్నారు. మరొకరేమో “నువ్వు ఇలా రాశావు కాబట్టే పత్రిక అమ్మకాలు ఇలాగున్నాయి” అని మార్క్సు ని విమర్శించడం మొదలెట్టారు. దీనితోటి పెట్టుబడి పెట్టిన వాళ్ళే” ఇక మేము పెట్టుబడి పెట్టం”అని అనడంతో మొట్ట మొదట సంచికే చిట్ట చివరి సంచిక అయ్యింది. మళ్ళీ మార్క్సు యొక్క పరిస్థితి మొదటి కొచ్చింది. మార్క్సు నీ, జేన్నీని “మీకెందుకు మేం వున్నాం” అని హామీ ఇచ్చి తీసుకువచ్చిన వాళ్ళు, నడిరోడ్డు మీద వదిలేసి, వాళ్ళ త్రోవ వాళ్ళు చూసుకున్నారు.

అప్పటికి జెన్ని ఏడు నెలల గర్భవతి. ఆర్ధిక పరిస్థితి దారుణంగా తయారయ్యింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఏం జరిగిందంటే, మార్క్సు అంతకు ముందు జర్మనీ లో వుండగా ఒక పత్రిక నడిపాడు అనుకున్నాం కదా! వాళ్ళు ఏమన్నారంటే” నువ్వు జర్మనీ లో వుండగా నడిపిన పత్రికకు లాభాలు బాగా వచ్చాయి. లెక్కలు ఇప్పుడు చూసాము. అందుకని, నీకు ఇప్పుడు కొంతకొంత మొత్తాన్ని బోనస్ గా పంపిస్తున్నాము” అని భారీ మొత్తాన్నే పంపించారు. దాంతో మార్క్సు కీ, జేన్నీకీ తాత్కాలికంగా కొంత ఉపశమనం కలిగించింది. ఇలా కాలం గడుస్తుండగా మార్క్సు, జెన్నీ లకు మొదటి సంతానం ఆడపిల్ల జన్మించింది. అది1844 మే ఒకటో తేది. ఆ పాపకు జెన్ని పేరు కలిసే లాగ “జెన్ని చెన్” అని పెట్టుకున్నారు. ఆ పాపకే కాదు. ఆ తరువాత పుట్టిన ఆడపిల్లలందరికీ జెన్ని పేరు కలిసేలాగ ముందు జెన్ని పేరు ఆ తరువాత మరో పేరు ఉండేలా చూసుకున్నారు.

ఇప్పుడు మరో సమస్య ప్రారంభమయింది. ఈ పాపను పెంచడంలో మార్క్సు కు గానీ, జెన్నీకి గానీ అనుభవం లేదు. ఎందుకంటే, జెన్నీ సంపన్న కుటుంబంలో నుండి వచ్చింది. వాళ్ళ కుటుంబాల్లో నర్సులు వుండేవారు. వాళ్ళ చేతికి పిల్లల్ని ఇచ్చేస్తే, వాళ్ళే పెంచుతుండే వాళ్ళు. ఇటువైపు మార్క్సు అయితే, అతను ఇంటి బాధ్యత ఎప్పుడూ తీసుకోలేదు. ఇక పిల్లల్ని పెంచడం అనే ప్రసక్తే లేదు. దాంతోటి ఆ పిల్లని పెంచడంలో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. పాప, పుట్టిన కొద్ది రోజులకే తరచూ అనారోగ్యానికి గురవ్వడం, మూర్చలు పోవడం ఇలాంటివన్నీ ఎదురయ్యాయి. అలాంటి సమయంలో మార్క్సు ని ఆదుకున్న ఒక వ్యక్తి – మార్క్సు కి తల్లి తరపు బంధువు “హెన్రిక్ హెయిన్”. అతను మంచి కవి కూడా. అతను ఎప్పుడో జర్మనీ నుండి పారిపోయి వచ్చి, పారిస్ లో తలదాచుకున్నాడు. ఎవరి ద్వారానో పరిచయం అయ్యాడు. చుట్టరికాలు చూసుకుంటే, మార్క్సు వాళ్ళ తల్లికి దూరపు బంధువు అని తెలిసింది. కాకపోతే, అప్పటికే అతని ముఖానికి పక్షవాతం వచ్చేసి వుంది. అతని భార్య పెద్దగా చదువుకోలేదు. ఆమె ఎవరితోనూ కలిసేది కాదు. కానీ, మార్క్సు, జెన్నీలు చిన్న పిల్లతో ఇబ్బంది పడుతున్నారని ఆ భార్యా, భర్తా తెలిసి, వాళ్ళంతట వాళ్ళే వీళ్ళకు సహాయం చేయడానికని వచ్చారు. అలా కొంతకాలం నడిచింది.

పాప ఆరోగ్యం బాగుండడం లేదు. జెన్నీకి ఆందోళన ఎక్కువయ్యింది పాప ఏమవుతుందోనని. అలాంటి సమయంలో పాపను తీసుకుని పుట్టింటికి వెళ్దామని నిర్ణయిచుకుంది. మార్క్స్ ఏమనుకున్నాడంటే" నిజమే, అక్కడ కనీసం కొన్ని రోజుల పాటైనా వుంటే ఆరోగ్యం బాగుపడుతుంది" అని జెన్నీ అనుకున్నట్టే అనుకున్నాడు. పారిస్ లో కాపురం పెట్టి సంవత్సరం కూడా పూర్తి కాలేదు. మార్క్స్ చూస్తే రాజకీయ విశ్లేషణలూ, మీటింగుల్లో తిరుగుతున్నాడు., పుస్తకాల మధ్యలో వుండిపోతున్నాడు. రాజకీయాల్లో మునిగి ఏమైపోతాడోనని ఆమె బెంగ. ఇలాంటి పరిస్థితిలో మార్క్స్‌ను వదిలి వెళ్ళడానికి ఇష్టంలేదు జెన్నీకి. అయినా పాప ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెళ్ళక తప్పలేదు. 1844 జూన్ మొదటి వారంలో, నెలరోజుల పసి పాపను పొత్తిళ్ళలో పెట్టుకుని జర్మనీ లోని పుట్టింటికి వెళ్ళింది.

ఇక్కడ మార్క్స్ పారిస్ లోని వివిధ ప్రజాసంఘాల్లో తిరుగుతున్నాడు. ఆ రోజుల్లోనే మార్క్స్ రాసినటువంటి వ్యాసాలన్నీ దాదపు వంద సంవత్సరాల తర్వాత "పారిస్ మాన్యుస్క్రిప్ట్" అనే పేరుతొ ప్రచురితమయ్యాయి.

జెన్నీ పాపను తీసుకుని పుట్టింటికి  వెళ్ళిన కొద్ది రోజులకే ప్రష్యాలో నూనె మిల్లు కార్మికులు, యజమానుల మీద తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటును అణచివేయడానికి నూనె మిల్లుల రక్షణ కోసం, ప్రభుత్వం రక్షక దళాలను ఏర్పాటు చేశారు. అయినా కార్మికులు భయపడకుండా ఎదిరించారు. ఆ స్థాయిలో జరిగిన తిరుగుబాటు ప్రష్యాలో ఒక మినీ విప్లవం లాగా అయింది. అక్కడ జరుగుతున్న విషయాలన్నీ జెన్ని, మార్క్స్‌కు ఉత్తరాల ద్వారా తెలియజేస్తుండేది. మార్క్స్ తను చేస్తున్నటువంటి అధ్యయనాలూ, భార్య పంపిస్తున్న కార్మికుల పరిస్థితులూ అన్నీ కలిసి" ఓవాట్స్" (అంటే ముందడుగు అని అర్థం) అనే తీవ్రవాదుల పత్రికకు వ్యాసాలు రాసి పంపించడం ప్రారంభించాడు. వ్యాసాల రచయత పేరు దగ్గర" ఏ గర్ల్ ఫ్రం జర్మనీ" అని  పెట్టాడు. ఇవన్నీ కూడా ప్రష్యా ప్రభుత్వానికి తెలిసిపోయాయి. ప్రష్యా లో జరుగుతున్న ఈ పరిణామలన్నీ, బయట ప్రపంచానికి తెలియకూడదని అనుకున్నాము. మరి, ఎలా తెలుస్తున్నాయి? అని ప్రభుత్వం భావించి, అన్వేషణ మొదలు పెట్టింది. అదే రోజుల్లో ప్రష్యా రాజు మీద ఎవరో హత్యాప్రయత్నం కూడా చేశారు. ఆ హత్య ప్రయత్నం చేసిన వ్యక్తి దొరికిపోయాడు. అతన్ని వురి తియ్యడానికి ప్రయాణాలు ప్రారంభించారు. ఆ విషయాలన్నీ జెన్నీ, మార్క్స్‌కి రాయడం, ఆ వివరాలన్నీ మార్క్స్ పేపర్ లో రాయడం కూడా జరిగింది.

ఎలాగైతే మార్క్సే ఇవన్నీ రాసాడని తెలిసిపోయింది. పారిస్ లో వున్నా మార్క్స్ కోసం ప్రష్యా ప్రభుత్వం వేట ప్రారంభించింది. మార్క్స్ మాత్రం తీవ్రమైనటువంటి భావజాలంతో వారం వారం వార్తలు రాస్తూనే వున్నాడు. జెన్ని ఇంకా ప్రష్యా లోనే వుంది. పాప ఆరోగ్యం కొంచెం కొంచెంగా మెరుగు పడుతోంది.

ఇది ఇలా వుండగా 1844 ఆగస్ట్ 28 వ తేదిన మార్క్స్ కంటే రెండేళ్ళు చిన్నవాడైన ఒక కుర్రవాడు, తరువాత రోజుల్లో మార్క్స్ జీవితంలో అత్యంత ప్రధానమైన పాత్ర పోషించిన వాడు వచ్చి, మార్క్స్‌ను కలుసుకున్నాడు. ఇది అతి సాధారణంగా జరిగిన సంఘటన గానే అనిపిస్తుంది. గానీ, అ తరువాత మార్క్స్ ని అనేక విధాలుగా కాపాడింది ఆ

కుర్రవాడే. కార్ల్ మార్క్స్ పక్కన అతని పేరు లేకుండా, ఎవరూ మార్క్స్ చెప్పుకోలేనంతగా రెండు పేర్లూ కలసిపోయి వుంటాయి. ఆ కుర్రవాడు ఎవరో ఈపాటికే గ్రహించే వుంటారు. అతని పేరు తెలుసుకోబోయే ముందు ఆ రోజుల్లో మార్క్స్ వ్యవహార శైలి ఎలా ఉండేదో తెలుసుకుందాం.

మార్క్సుకు మిత్రులు ఎక్కువ మంది వుండేవారా? తక్కువ మంది వుండేవారా? అని కూడా తెలుసుకోవాలి. మార్క్స్ ఇంట్లో ఉన్నపుడూ, వ్యాసాలు రాసేటటువంటి ఒత్తిడి లేనపుడూ, ఎక్కువగా నిద్రలేమి లేనపుడూ, అనారోగ్యం లేనపుడు మార్క్స్ చాలా మంచి వాడు. జెన్నీతో చాలా ప్రేమగా ఉండేవాడు. ఇంటికి ఎవరు వచ్చినా , నవ్వుతూ, తుళ్ళుతూ హుషారుగా ఉండేవాడు. ఏమిటి? ఇంత సరదాగా వున్న మనిషేనా , ఇంత తీవ్రమైన వ్యాసాలు రాస్తున్నాడు. అనిపించే విధంగా వుండేవాడు. కానీ, ఆ ఒత్తిడిలో అనారోగ్యం వస్తే మాత్రం, మనిషి చాలా కకావికలం అయిపోతుండేవాడు. ఇదంతా ఇంట్లో వుండగా.  బయటకు వస్తే మాత్రం, మనిషి మహా మొండివాడు. విపరీతమైన పట్టుదల ఉన్నటువంటి వాడు. తన వాదనే గెలవాలనేటట్లు మాట్లాడేవాడు. ఎలాగైనా తన వాదనతోటి, ఎదుటి వాళ్ళని ఒప్పించాలనీ, ఓడించాలనీ ప్రయత్నించేవాడు. అందుకనే అతన్ని "ఇంటలేక్క్యువల్ యారగేంట్" అని పిలిచేవారు. ఇతరులతో మాట్లాడే సందర్భంలో తన స్వరం పెంచి మాట్లాడేవాడు.

ఏదైనా వాదన వస్తే, కొట్టడం ఒకటే మినహాయింపు. తను కాలేజీలో చదివే రోజుల్లోనూ, తన మిత్రులతోనూ, వాదించేటప్పుడు కూడా వెళ్లి వాళ్ళను కొట్టేస్తాడేమో అనిపించేటట్లు ప్రవర్తించేవాడు. ఏ మాత్రం తన వాదనలో ఓడిపోవడానికి ఇష్టపడేవాడు కాదు. సాధారణంగా పది మందితోటి కలిసిపోయి, కబుర్లు పెంచుకుని, పరిచయాలు పెంచుకుని వాళ్ళందరికీ సహాయంగా వుండే మనస్తత్వం కాదు. గానీ, ఇదిగో ఇలాంటి దుడుకుతనం, మేధావితనం, ఎదుటివాళ్ళని ఒప్పించే విధానం, ఎలాగైనా "తన మార్గం మంచిది" అని చెప్పగలిగే విధానం, వీటన్నిటి నుండి మార్క్స్ వద్దనుకున్నా గానీ, చాలామంది మిత్రులు వచ్చేస్తుండేవారు. రష్యా లో ఒకాయన అన్నాడు" హియీజ్ ఎ డెమోక్రటిక్ డిక్టేటర్" అని. ఇది మార్క్స్ యొక్క వ్యవహార సహజమైన శైలి. అలాంటి మార్క్సుకు, కుడి ఎడమల నిలిచి, జీవితాంతం రక్షించుకున్న వాళ్ళు ఇద్దరు. ఒకరు మార్క్స్ భార్య జెన్నీ. తన రాజీ లేని ప్రేమతో, ఓరిమితో అతన్నే అంటి పెట్టుకు వుంది. రెండో వ్యక్తి ముందు మనం అనుకున్న 24 ఏళ్ళ కుర్రవాడు.

అతడే "ఫ్రెడరిక్ ఎంగెల్సు"ఈ ఎంగెల్సు, మార్క్స్ యొక్క అన్ని బలహీనతల్ని అర్థం చేసుకొని, అతడిని జీవితాంతం అనుసరించి, ఆర్థికంగా ఆదుకుని, మానసినక స్థైర్యాన్ని ఇచ్చి, మార్క్స్ చారిత్రక రచనల్లో ఒక భాగం అయి, మార్క్స్ చనిపోయాక కూడా "కేపిటల్ " మిగతా భాగాలను ప్రచురించింది కూడా ఈ ఎంగెల్సే. మార్క్స్ కు పరిచయం కాక ముందే అతను తీవ్రవాది. అంతకు ముందే అతను సమాజాన్ని చాలా విశ్లేషించాడు. అలాంటి భావాలున్న ఎంగెల్సుకు, మార్క్స్ కూడా అదే పద్ధతిలో వున్నాడని తెలిసి, కలుసుకోవడానికి వచ్చాడు. మార్క్స్, జెన్నీ ల జీవితంలో

అంత బలీయమైన పాత్ర పోషించిన ఆత్మీయుడూ, సరిగ్గా చెప్పాలంటే రక్షకుడు ఎంగెల్సు గురించి తెలుసుకోకుండా మార్క్సు జీవిత చిత్రణ పూర్తి కాదు. ఈ ఎంగెల్సు యొక్క నేపథ్యం, అతని కుటుంబ నేపథ్యం ఎలా వున్నాయి? వాళ్ళు కలిసాక మార్క్సు, జేన్నీల యొక్క జీవితం ఎలా కొనసాగింది? ఇలాంటి విశేషాలు వచ్చే భాగంలో తెలుసుకుందాం.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 అక్టోబర్ 8 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు
https://youtu.be/NhGQASBimtk

COMMENTS